# మత్త కోకిల

ఆ అమ్మాయి, రోజూ సరిగా అదే వేళకు అక్కడకు వస్తుంది. గోదావరి అలలమీద గాలి బంతులులాగా ఎగరేసుకుంటూ వెన్నెల చారికలు చీకటి దొంతరలను తరమడం మొదలుపెట్టగానే, మోడై పోయిన చెట్టు, ఉగ్గం వేరుమీద నుంచి, మోపిన తల ఎత్తి, నేలను ఆసరా తీసుకుని లేచి, వంతెన మీదనుంచి వచ్చే రైలు పొల్లి కూతలో కలిపి, ఇగుర్చుకు పోయిన గుండెలు విచ్చేటంత కేకపెట్టి బావురు మనడం, ఇంటి గుమ్మం ఎక్కి లోపల సముదాయించుకుంటుంది. పవలల్లా ఇంటినిపడి వేయి వెర్రులు ఎత్తిన దానిలాగా తిరుగుతుంది. మౌనంగా సమాధిలో పడిపోయినట్టు సాలభంజికలాగా వ్రాలిపోతుంది. మూసిన కన్ను సూర్యుడు క్రుంకుతూండగా.... ఏనుగంత సత్తువతో....గోదావరి గట్టుకు....ఎండిన మ్రాని మొదలుకు....

ఎందుకు వెళుతుందో తెలియదు. ఏమి కావాలి? ఏం హాయి అనుభవించాలి?— ఆమెకు కావలసిన వాళ్ళే అర్థం తెముల్చుకోలేక ఆ ప్రశ్నలు వేసుకోవడం మాను కున్నారు. ఎక్కడకు వెళుతుందో, ఎప్పుడు వస్తుందో గమనించరు. ఏమీ అనరు. కలకలలాడే ముఖాలతో కాని, అవసరం వచ్చినప్పుడన్నా పలుకరించరు.

ఆమె మానాన ఆమె బ్రతికి బాగుంటే చాలు....ఇష్టం వచ్చినట్టుగా వుండటానికి ఎవరూ ఏ అభ్యంతరమూ చెప్పరు. కాని పనేమీ చేస్తూన్నదని కాదు వాళ్ళవాళ్ళ ఆవేదన....ఎంతటి అకృత్యమైనా చేసి, ఆమె మళ్ళా బాహ్యస్మృతి తెప్పించుకుంటే, అదే చాలు.

పడుచుపిల్ల....నోరూరించగల వయసులో వున్న సంపన్నుల పడుచు ఒంటరిగా వేళగాని వేళ, దొరికినప్పుడు, ఎంత సౌమ్యుడికైనా, నాడి కదను త్రొక్కుతుంది. ఒకరిద్దరు, మీదుగా రాచుకుపోవడం, చేతికి చేయి కలిపి నిలవేయడం—ఇలాటి సన్నాహాలు చేసి చూశారు. కాని, దారుమూర్తిలాగా, స్పర్శను గమనించకుండా అడుగు నిలపకుండా, ఏ విధమయిన ఖంగారూ లేకుండా....పోయే అమ్మాయి....మీద ఎన్ని భూతాలు ఆడుతూన్నవో అని భయపడి....ప్రాణంమీద ఆశ వున్న వాడెవడూ: ఆమె జోలికి రావడం మానివేయడంలో ఆశ్చర్యం ఏమీ లేదు.

“ఎవరమ్మా నీవు?”—ఎంతమంది ఎన్నిచోట్ల ఎన్ని వేళల్లో ఆ ప్రశ్న ఎన్ని గొంతులతో అడిగారు? చెవికెక్కిందా? ఇసీ వానిలోనే జమ.

“ఎవ రా కూర్చున్నది?”—రెండోనాడు ప్రశ్నలో క్రమం మారింది కాని, ఆమె వాలకం, అంత మాత్రాన మారినట్టు కనపడలేదు.

“ఎవరంటే మాట్లాడవేం?”—రెండు రోజుల నుంచీ ఓపికగా చూస్తున్నాడు, ఆ షికారీ. లంకలలోకి పిట్టల వేటకు తెప్ప వేసుకు వెళ్ళి....ఆకాశం ఎర్రపడిన తర్వాత నీటి వాలున ఒడ్డుకు చేర్చి వెన్నెల వచ్చేదాకా తెడ్డుతో అలలు రేపుతూ, అనంతంలోకి చూస్తూ కూర్చుని ఉంటాడు ఆ వయసు కాడు. ఎగువను గట్టుమీద పడుచు మెసలడం నడికట్టాడు. పలుకరింపులు వినిపించుకోకపోవడం మూలాన ఎవరో జగజంత కదా అని ఏనాటి కానాడు, నావలో అడుగు కారులో పెట్టేటప్పటికి మరచిపోయేవాడు. ఒకనాడు, రెన్నాళ్ళు....ఇక కథ కొంచెం ముదరనిద్దామనే ఉత్సాహం వేసింది. దగ్గరకు వెళ్ళాడు. వెన్నెల విచ్చగానే, చంద్రబింబంకన్న మెరిసింది ఆమె ముఖం. సూదివార ఎడంలేకుండా పూసుకుని నిలుచున్నాడు. ఆమె చలించలేదు. వల్లమాలిన చొరవచేసి, పెదవి ఎంగిలి చేశాడు. ముదురుపాకం హల్వా ముక్కలాగా అధరం పలు మొనకు ఎదురు తిరిగి గంటును కోరుకుంది. చురుకుకు, ఆమె కళ్ళల్లోకి జీవం కమ్ముకు వచ్చింది....చేరలకు మీరిపోయినది. అతని మీదుగా గోదావరిలోకి చూసింది.

“రావూ....అలలలోనుంచి ఇంకా లేచిరావేం?”

అతనికి అర్థం కాలేదు. తన భయం మాపుకునేందుకు ఆమెను సందిట పట్టుకున్నాడు.

"నీలాగే నేనూ మునిగిపోతున్నాను."

ఈ కేకలతో, ఆ సాహసికి వణుకు పుట్టుకు వచ్చింది. కాని గంద్రగోళంగా ఆమె విషాద—గాథ అర్థం అయింది.

"మాయపౌతావా....మునిగిన చోటుకూడా దాచేసుకుంటున్నావా ?"

ధైర్యంవచ్చి....ముద్దులతో ఆమెకు ఊపిరి బెనగకుండా చేశాడు. వాడిన తామరతూడు లాగా అయిపోయి వాలిపోతే....చెట్టు మొదల జారవిడిచి కారు దగ్గరకు పరుగెత్తాడు.

ఆ మరునాడు....నీటి మీదుగా కాకుండా....కారులో యకాయకిని....గట్టు దగ్గరకు వచ్చేశాడు. చెట్టు....ఆ మోడు లేదు. నరుకులైన, తుండ్లరాసి చెల్లాచెదరుగా పడివుంది. ఆ అమ్మాయీ లేదు.

మనసు నిలువక....ఎక్కడికీ పోవాలనే ఆలోచన లేకుండానే గట్టు పుచ్చుకుని ఎగువ ఎక్కుతున్నాడు; దూరాన....ఆమె జాడ కనిపించింది. బెదురుగా వెళ్ళాడు. చెంగున లేడి పిల్లలాగా అతని కౌగిటిలోకి దుమికి-

"వెన్నెల వచ్చినా....ఎంతసేపని నీకోసం వెదకాలి?" అన్నది.

"చీకటి అంటే నాకు భయం"

"నాకూ భయమే."

"వద్దు. నీకు కావాలంటే నక్షత్రాలు చిదిపి దీపం పెడుతాను. మసకన్నమాట కనిపించదు."

"సై."

ఇద్దరూ చెట్టాపట్టాలు వేసుకుని, చిన్నపిల్లలులాగా గంతులువేస్తూ పరుగెత్తారు. ఆమె నవ్వు తెరలు తెరలుగా పొర్లి....కారు హారన్‌లో లయించింది. గట్టుమీదికి బిమూలగా చాలాదూరం వరకూ కారు జంట దీపాలు చీకటిని చీల్చి చెంగాడకానికి వెదకుతూ దౌడు తీస్తూన్నవి. దీప మాలికలాగా వంతెన మీదనుంచి రైలు రంయిన పరుగెత్తింది. గోదావరిలో ఉద్దోలంగా లేచిన కెరటం ఒడ్డుకు రాకుండానే చదునై వెన్నెలలో విరిగినంత మేరా ఒడిదుడుకులతో మిలమిలలాడింది.